సాక్షి సిద్దిపేట

మంగళవారం। 5। డిసెంబర్। 2023

కారు జోరు.. ప్రత్యర్థులు బేజారు



రాష్ట్ర మంతా కాంగ్రెస్ గాలి వీయగా.. దుబ్బాక నియోజకవర్గంలో మాత్రం బీఆర్ఎస్ ఎదురులేకుండా దూసుకుపోయింది.

వివరాలు 8లో ▸



ఆధ్యాత్మిక కేంద్రాలుగా ..

భక్తి భావనతోనే మనసుకు ప్రశాంతత లభిస్తుందని మాధవానంద సరస్వతీ స్వామి భక్తులకు అనుగ్రహభాషణం చేశారు.

వివరాలు 8లో ▸



ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టం చేయాలి

ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం చేయాలని డీబీఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు వినయ్ కుమార్, జాతీయ కార్యదర్శి శంకర్ డిమాండ్ చేశారు.

వివరాలు 9లో ▸

ఎక్కడ ఎక్కువ తక్కువ

- పోలింగ్ సరళిపై నేతల పోస్టుమార్టమ్
- బూత్‌ల వారీగా చర్చ
- త్వరలో జరిగే 'స్థానిక' ఎన్నికల్లో ప్రభావంపై సర్పంచ్‌ల అంచనాలు

సాక్షి, సిద్దిపేట: ఎక్కడ లీడ్ వచ్చింది.. ఎక్కడ వెనుకడుగు పడ్డామని ఆయా పార్టీలలో జోరుగా చర్చసాగుతోంది. శాసనసభ ఎన్నికల్లో పోల్ అయిన ఓట్లపై సోమవారం అభ్యర్థులు, ఆయా మండలాలకు చెందిన ముఖ్యనాయకులతో పోస్టుమార్టం చేసినట్లు విశ్వసనీయ సమాచారం. అలాగే త్వరలో గ్రామ పంచాయతీ ఎన్నికలు జరగనుండటంతో ఈ ఎన్నికల్లో వచ్చిన ఓట్లతో ప్రస్తుత సర్పంచ్‌లు, పోటీ చేయాలనుకున్న సర్పంచ్‌లు అంచనాలు వేసుకుంటున్నారు.

తక్కువ వచ్చిన చోట..

ఎక్కడ తక్కువ ఓట్లు రావడంతో మెజార్టీ తగ్గిందని గెలుపొందిన అభ్యర్థులు.. ఏఏ గ్రామాల్లో తక్కువ ఓట్లు రావడం వల్ల ఓటమి చెందామని ఓడిపోయిన అభ్యర్థులు అంతర్మథనం చేస్తున్నారు. తక్కువ వచ్చిన చోట్ల ఆయా గ్రామాల నేతలతో ఫోన్‌లో మాట్లాడుతున్నట్లు తెలిసింది. లీడ్ వస్తుందని అనుకున్న మండలంలో మెజార్టీ తగ్గడంతో ఎందుకు ఇలా జరిగిందని దీర్ఘాలోచనలో పడ్డారు. బూత్‌ల వారీగా వచ్చిన ఓట్ల షీట్‌ను దగ్గర పెట్టుకుని నాయకులు కార్యకర్తలతో చర్చిస్తున్నారు. మీ గ్రామం, కాలనీలో అభివృద్ధి చేసినా ఎందుకు తగ్గిందని తెలుసుకుంటున్నారు. ఎన్నికల ప్రచారం సరిగా నిర్వహించలేదా? సంక్షేమ పథకాల పంపిణీలో ఏమైనా లోటు చేశామా? అని స్థానిక ప్రజాప్రతినిధులు, మండల నాయకులతో ఓటమి చెందిన అభ్యర్థులు చర్చించుకుంటున్నారు.

త్వరలో పంచాయతీ ఎన్నికలు

ఫిబ్రవరితో పంచాయతీ సర్పంచ్‌ల పదవీ కాలం ముగియనుంది. దీంతో సర్పంచ్‌గా పోటీ చేయాలనుకున్న అభ్యర్థులు, ప్రస్తుత సర్పంచ్‌లు ఆయా పార్టీలకు ఎన్ని ఓట్లు వచ్చాయి? త్వరలో జరిగే గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఎలాంటి ప్రభావం ఉంటుందని అంచనాలు వేస్తున్నారు. ఇప్పటికే కొనసాగుతున్న సర్పంచ్‌లు అయితే గ్రామంలో ఇంకా ప్రజా అవసరాలు ఏమి ఉన్నాయో గుర్తించి వాటిపై దృష్టి పెట్టాలని నిర్ణయించుకుంటున్నారు.



న్యూస్‌రీల్

కొనుగోలు కేంద్రాల సందర్శన



పెద్దకోడూరులో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారి

చిన్నకోడూరు(సిద్దిపేట): ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం ఏపీఎం మహిపాల్ సందర్శించారు. మండలంలోని పెద్దకోడూరు, చిన్నకోడూరు, రామంచ గ్రామాల్లోని కేంద్రాల్లోని రికార్డులు పరిశీలించారు. రైతుల, నిర్వాహకుల సమస్యలు తెలుసుకున్నారు. తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని సూచించారు. రైతులు ఆరబెట్టిన ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకురావాలన్నారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ఆయన వెంట సీసీలు కొమురయ్య, శ్రీనివాస్ రెడ్డి, వీఓఏలు తదితరులు పాల్గొన్నారు.

పల్లాను కలిసిన దూల్మిట్ట నాయకులు



పల్లాకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

మద్దూరు(హుస్నాబాద్): జనగామ ఎమ్మెల్యేగా ఎన్నికైన పల్లా రాజేశ్వర్‌రెడ్డిని దూల్మిట్ట మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు దీపికవేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థి ఓటమి తట్టుకోలేక..

నాయకుడి ఆత్మహత్యాయత్నం

హుస్నాబాద్: బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సతీశ్ కుమార్ ఓటమిని తట్టుకోలేక పార్టీ నాయకుడు ఆత్మహత్యకు యత్నించాడు. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. హుస్నాబాద్ పట్టణానికి చెందిన వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ విజయ్‌భాస్కర్ ఆదివారం జిల్లా కేంద్రంలో జరిగిన ఎన్నికల కౌంటింగ్ కేంద్రానికి వెళ్లాడు. తుది ఫలితాల్లో సతీశ్ ఓటమి చెందాడని తెలిసి హుస్నాబాద్‌కు వచ్చి పురుగు మందు తాగాడు. గమనించిన స్నేహితులు వెంటనే విజయ్ భాస్కర్‌ను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యంగానే ఉన్నట్లు బీఆర్ఎస్ శ్రేణులు తెలిపాయి.

నాచగిరిలో కార్తీక సందడి



నాచగిరిలో వ్రతమాచరిస్తున్న దంపతులు

వర్గల్(గజ్వేల్): శివకేశవులకు ప్రీతికరమైన కార్తీకమాసంలో ప్రసిద్ధ నాచగిరి క్షేత్రంలో సోమవారం సైతం రద్దీ కొనసాగింది. నాచగిరీశుని సన్నిధిలో 53 సామూహిక సత్యదేవుని వ్రతాలు, 6 కల్యాణాలు, 3 సేవలు జరిగాయి. క్షేత్రానికి తరలివచ్చిన భక్తులు మొక్కులు తీర్చుకుని, స్వామివారిని దర్శించుకుని తరించారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు.

పీసీసీ అధ్యక్షుడి పోరాటంతోనే..

తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి



కాంగ్రెస్ నాయకుల సంబరాలు

పటాన్‌చెరు టౌన్: పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి పోరాటంతోనే తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి అన్నారు. సోమవారం కాంగ్రెస్ నాయకులతో కలిసి పట్టణంలో స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో బాణాసంచా కాల్చి, మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టి, ప్రశ్నించే గొంతులను నొక్కినప్పటికీ... ప్రజా పోరాటాలపైన రేవంత్‌రెడ్డి అనేక పోరాటాలు, ఉద్యమాలు చేశారన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సంజీవరెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు కుంచాల కిషన్, పాషా, ఆసిఫ్, అషత్ రాజు ముదిరాజ్, యువరాజ్ మోరే, శ్రీనివాస్, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి రేసులో పొన్నం

- **జిల్లాలో ఏకైక కాంగ్రెస్ ఎమ్మెల్యే**
- బీసీ కోటా కింద మంత్రి వర్గంలో చోటు!
- ఉప ముఖ్యమంత్రి అయ్యే అవకాశం
- ప్రభాకర్‌కు పార్టీ పెద్దలతో సత్సంబంధాలు



పొన్నం ప్రభాకర్

సాక్షి, సిద్దిపేట: శాసనసభ సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి సంపూర్ణ మెజార్టీ లభించింది. ప్రభుత్వ ఏర్పాటుకూ చకచకా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో నూతన మంత్రి వర్గం ఏర్పాటు చేయనున్నారు. మంత్రి వర్గం రేసులో హుస్నాబాద్ ఎమ్మెల్యే పొన్నం ప్రభాకర్‌గౌడ్ ఉన్నారు. జిల్లా నుంచి గెలుపొందిన ఏకైక కాంగ్రెస్ ఎమ్మెల్యే కావడం.. ఢిల్లీ స్థాయిలో సత్సంబంధాలు, బీసీ వర్గానికి చెందిన వ్యక్తి కావడంతో మంత్రి వర్గంలో చోటు లభించే అవకాశాలున్నాయి. ఈ ఎన్నికల్లో ఎల్‌బీనగర్ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసిన మధుయాష్కి గౌడ్ ఓటమి చెందడంతో పొన్నంకు లైన్ క్లియర్ అయిందన్న చర్చ సాగుతోంది. కాంగ్రెస్ అధిష్టానం బీసీ వర్గానికి చెందిన నేతకు ఉప ముఖ్యమంత్రి పదవి ఇవ్వాలనుకుంటే ప్రభాకర్ గౌడ్‌కు వచ్చే సూచనలు కనిపిస్తున్నాయి.

పార్టీ పటిష్టతకు..

హుస్నాబాద్‌లో కాంగ్రెస్ అభ్యర్థి పొన్నం ప్రభాకర్ గౌడ్‌కు 1,00,955 ఓట్లు, బీఆర్ఎస్ అభ్యర్థి సతీశ్ కుమార్‌కు 81,611ఓట్లు వచ్చాయి. సతీశ్‌కుమార్‌పై ప్రభాకర్ 19,344 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక, జనగామ నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ పార్టీకి చెందిన వారే ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. దీంతో జిల్లాలో కాంగ్రెస్ పట్టును మరింత పెంచుకునేందుకు మంత్రి వర్గంలో పొన్నంకు చోటు కల్పించే అవకాశాలు ఉన్నాయి. హుస్నాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం మూడు జిల్లాలలో ఉంది. హుస్నాబాద్, కోహెడ, అక్కన్నపేట మండలాలు సిద్దిపేట జిల్లాలో, చిగురుమామిడి, సైదాపూర్‌లు కరీంనగర్ జిల్లాలో, ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండలాలు హన్మకొండ జిల్లాలో ఉన్నాయి. పొన్నం ప్రభాకర్‌కు మంత్రి వర్గంలో అవకాశం కల్పించడం వలన మూడు జిల్లాల్లో తన ప్రభావం చూపే అవకాశం సైతం ఉంటుందని పార్టీ వర్గాలు ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది.

విద్యార్థి దశ నుంచే..

విద్యార్థి సంఘం నాయకుడి నుంచి ఎదిగిన వ్యక్తి పొన్నం. మొదటి నుంచి కాంగ్రెస్‌లోనే కొనసాగుతున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2005–2009 వరకు మార్క్ ఫెడ్ చైర్మన్‌గా పొన్నం చేశారు. 2009–2014 వరకు కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడి కొనసాగారు. ప్రత్యేక రాష్ట్ర సాధనలో కీలక భూమి పోషించిన నాయకుడిగా గుర్తింపు పొందారు. పార్లమెంట్‌లో తెలంగాణ బిల్లు ప్రవేశపెట్టే సమయంలో పెప్పర్ స్ప్రే కు గురయ్యారు. ఉద్యమ నాయకుడిగా మంచి పేరు తెచ్చుకున్నారు. నాటి నుంచి నేటి వరకు బీఆర్ఎస్ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలు సాగిస్తూ విమర్శలు ఎక్కుపెట్టిన నాయకుడిగా గుర్తింపు పొందారు. కాంగ్రెస్ పార్టీలోనే కాకుండా, బీసీ నాయకుడిగా ముందు వరుసలో నిలిచిన వ్యక్తి. తన మాటల తూటాలతో ప్రజలను ఆకట్టుకునే విధంగా విమర్శలను తిప్పికొట్టే వాగ్ధాటి. బడుగు బలహీన వర్గాలు, గౌడ సామాజిక వర్గంలో మంచి పట్టు ఉంది.



కేసీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యేలు

బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌ను ఉమ్మడి మెదక్ జిల్లాలో కొత్తగా గెలుపొందిన ఆరుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సోమవారం రాత్రి ఎర్రవెల్లిలోని తన ఫాంహౌస్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. కేసీఆర్‌ను కలిసిన వారిలో ఎమ్మెల్యేలు తన్నీరు హరీశ్‌రావు, కొత్త ప్రభాకర్‌రెడ్డి, సునీతాలక్ష్మారెడ్డి, చింత ప్రభాకర్, గూడెం మహిపాల్‌రెడ్డి, మాణిక్‌రావు ఉన్నారు. - దుబ్బాకటౌన్

7న మల్లన్న హుండీల లెక్కింపు

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయ హుండీల లెక్కింపు ఈనెల 7న జరుగుతుందని ఈఓ బాలాజీ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భక్తులు వేసిన కానుకల హుండీలను లెక్కించనున్నట్లు తెలిపారు. లెక్కింపునకు ఆలయ సిబ్బంది సకాలంలో హాజరు కావాలని ఈఓ ఆదేశించారు.

గెలుపోటములు బీఆర్ఎస్‌కు కొత్తకాదు



మాట్లాడుతున్న ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

- కార్యకర్తలకు అందుబాటులో ఉండి కాపాడుకుంటాం
- ప్రజలకిచ్చిన హామీలు కాంగ్రెస్ నెరవేర్చాలి
- అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్: కాంగ్రెస్ పార్టీ ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చాలని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ(టీఎస్ఎఫ్‌డీసీ) చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం గజ్వేల్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తామని ప్రకటించిన కాంగ్రెస్ నేతలు తమ మాటను నిలబెట్టుకోవాలన్నారు. అదేవిధంగా రైతులకు యాసంగి పెట్టుబడి సాయాన్ని వెంటనే అందించాలని కోరారు. నియోజకవర్గంలో ప్రస్తుతం రూ.250కోట్ల పనులు ప్రగతి పథంలో ఉన్నాయని, వాటిని పూర్తి చేయడానికి కాంగ్రెస్ సహకరించాలని కోరారు. గజ్వేల్‌ను అభివృద్ధిలో యాభైఏళ్ల ముందుకు తీసుకెళ్లిన ఘనత కేసీఆర్‌కు దక్కిందని, ఈక్రమంలో ఆయనకు ప్రస్తుత ఎన్నికల్లో 45వేల పైచిలుకు మెజారిటీ అందించడం హర్షణీయమన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో ఏడుస్థానాలను గెలుపొందడానికి శ్రమించిన మంత్రి హరీశ్‌రావుకు ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు. బీఆర్ఎస్‌కు గెలుపోటములు కొత్త కాదని, 14 ఏళ్లపాటు ప్రతిపక్ష పాత్రలో ఉన్నామని, అదే తరహాలో నేడు కూడా ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం పనిచేస్తామన్నారు. కార్యకర్తలు, నాయకులు అధైర్యపడాల్సిన అవసరం లేదని చెప్పారు. వారికి ఏ కష్టం వచ్చినా అందుబాటులో ఉండి కడుపులో పెట్టుకొని కాపాడుకుంటామని స్పష్టం చేశారు. సమావేశంలో గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, ఎంపీపీ అమరావతి, జెడ్పీటీసీ మల్లేశం, ఆత్మ కమిటీ చైర్మన్ ఊడెం కృష్ణారెడ్డి, పార్టీ గజ్వేల్ మండల శాఖ అధ్యక్షులు బెండె మధు, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు చంద్రమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొత్త పయనం!

- పార్లమెంటు నుంచి అసెంబ్లీకి..
- రెండు పర్యాయాలు ఎంపీగా..
- ఇప్పుడు ఎమ్మెల్యేగా కొత్త ప్రభాకర్‌రెడ్డి ప్రయాణం
- నెరవేరిన దశాబ్దాల కల
- ఇప్పటి వరకు ఓటమెరుగని నాయకుడు

దుబ్బాకటౌన్: రెండు పర్యాయాలు పార్లమెంటు సభ్యుడిగా.. ఇప్పుడు మొదటి సారి ఎమ్మెల్యేగా గెలిచి అసెంబ్లీకి ప్రయాణమయ్యారు కొత్త ప్రభాకర్‌రెడ్డి. దుబ్బాక మండలం పోతారానికి చెందిన ప్రభాకర్‌రెడ్డి దుబ్బాక ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2014లో మెదక్ ఎంపీగా పోటీ చేసి గెలుపొందిన కేసీఆర్ ఆ తర్వాత అసెంబ్లీ ఎన్నికల్లో గజ్వేల్ నుంచి గెలుపొందారు. దీంతో ఎంపీకి రాజీనామా చేసి కొత్త ప్రభాకర్‌రెడ్డికి మెదక్ నుంచి అవకాశం కల్పించారు. ఉప ఎన్నికల్లో ప్రభాకర్‌రెడ్డి భారీ మెజార్టీతో విజయం సాధించి పార్లమెంటులో అడుగుపెట్టారు. ఆ తర్వాత 2019 పార్లమెంటు ఎన్నికల్లో సైతం రెండోసారి ఎంపీగా గెలుపొంది ప్రస్తుతం ఎంపీగా కొనసాగుతున్నారు. తాజాగా బీఆర్ఎస్ నుంచే దుబ్బాక ఎమ్మెల్యేగా మొదటి సారి గెలిచి శాసనసభకు వెళ్తున్నారు.

ఎంపీగా రికార్డు మెజార్టీలే..

దుబ్బాక ఎమ్మెల్యేగా గెలుపొందిన కొత్త ప్రభాకర్ రెడ్డి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు నమ్మినబంటు. వ్యాపారవేత్తగా ఉన్నత స్థాయిలో ఉన్న కొత్త ప్రభాకర్‌రెడ్డి కేసీఆర్ పిలుపుతో రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. 2014లో మెదక్ పార్లమెంటు ఉప ఎన్నికల్లో ప్రభాకర్‌రెడ్డి.. కేసీఆర్ కంటే అధికంగా 3,61,277 ఓట్ల రికార్డు మెజార్టీతో అప్పటి కాంగ్రెస్ అభ్యర్థి సునీతాలక్ష్మారెడ్డిపై ఘన విజయం సాధించారు. అలాగే 2019 పార్లమెంటు ఎన్నికల్లో సైతం మెదక్ నుంచే మళ్లీ 3,16,427 ఓట్ల భారీ మెజార్టీతో కాంగ్రెస్ అభ్యర్థిగాలి అనిల్ కుమార్‌పై గెలుపొందడం విశేషం. ప్రస్తుతం ఎంపీగా కొనసాగుతున్న ప్రభాకర్‌రెడ్డి కేసీఆర్ ఆదేశాల మేరకు దుబ్బాక ఎమ్మెల్యే అభ్యర్థిగా బీఆర్ఎస్ నుంచి పోటీ చేసి 53,513 ఓట్ల భారీ మెజార్టీతో గెలుపొందారు. సరిగ్గా ఎన్నికల ప్రచారం ప్రారంభం కాగానే అక్టోబర్ 30న దౌల్తాబాద్ మండలం సూరంపల్లిలో కత్తి దాడిలో తీవ్రంగా గాయాలపాలై ఆస్పత్రిలోనే 20 రోజుల పాటు ఉన్నారు. నామినేషన్ చివరిరోజున మాత్రమే ప్రత్యేక అంబులెన్స్‌లో వచ్చి నామినేషన్ వేశారు. పోలింగ్‌కు 2 రోజుల ముందు కోలుకోవడంతో సీఎం కేసీఆర్ సభలో పాల్గొని ప్రజలను తనను గెలిపించాలని అభ్యర్థించారు. దీంతో ఆయన ప్రచారం చేపట్టకున్నా ప్రజలు నమ్మకంతో భారీ మెజార్టీతో గెలిపించడం విశేషం.

నెరవేరిన కల..

ఇప్పటి వరకు తన రాజకీయ జీవితంలో ఓటమి ఎరుగని నేతగా ప్రభాకర్‌రెడ్డి ముందుకుసాగుతున్నారు. తనకు మొదటి నుంచి ఎమ్మెల్యే కావాలనే కోరిక ఉండేది. ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల్లో ఆ కల నెరవేరినట్లయింది. రామలింగారెడ్డి మరణంతో 2020 ఉప ఎన్నికల్లో 1079 ఓట్ల స్వల్ప మెజార్టీతో బీజేపీ నుంచి ఎమ్మెల్యేగా రఘునందన్‌రావు గెలుపొందారు. ఇప్పుడు ఆయనపై ప్రభాకర్‌రెడ్డిని పోటీకి దింపడంతో భారీ మెజార్టీతో విజయం సాధించారు.



కొత్త ప్రభాకర్‌రెడ్డికి శుభాకాంక్షలు చెబుతున్న బొప్పాపూర్ సర్పంచ్, నాయకులు

ప్రజల నమ్మకాన్ని నిలబెడతా

దుబ్బాకటౌన్: తనపై హత్యాయత్నం జరగడంతో తీవ్ర గాయాలతో ఆస్పత్రిలోనే చికిత్స పొందితే ప్రజలు అండగా నిలిచి భారీ మెజార్టీతో గెలిపించడం సంతోషకరమని కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తనపై ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారని వారి నమ్మకాన్ని ఎట్టి పరిస్థితుల్లో వమ్ము చేయనన్నారు. నన్ను రాజకీయంగా ఎదుర్కోలేక చంపాలని చూస్తే దేవుడి కరుణ, ప్రజల ఆశీస్సులతోనే నేను పునర్జన్మ ఎత్తానన్నారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం రాకపోవడం తనను నిరాశకు గురిచేసిందన్నారు. కాకపోతే కాంగ్రెస్ ప్రజలకిచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తానన్నారు. నేను ఎంపీగా రెండు పర్యాయాలు ప్రతి పక్షంలోనే ఉన్నానని, అయినా అత్యధికంగా నిధులు తెచ్చి మెదక్ పార్లమెంటు పరిధిలో చాలా అభివృద్ధి పనులు చేపట్టానన్నారు. ఇప్పుడు కూడా నియోజక వర్గం అభివృద్ధికి శక్తిమేరకు కృషి చేస్తానన్నారు. తనకు అండగా నిలిచి భారీ మెజార్టీతో గెలిపించిన నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. దుబ్బాక ఎమ్మెల్యేగా గెలుపొందిన కొత్త ప్రభాకర్‌రెడ్డికి శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. సోమవారం పోతారంలోని తన స్వగృహానికి ప్రజలు, నాయకులు తరలివచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

ఉద్యోగుల సేవలు భేష్



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న టీఎన్జీఓలు

- ఇబ్బందులు లేకుండా ఎన్నికల నిర్వహణ
- కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్

సిద్దిపేటరూరల్: అసెంబ్లీ ఎన్నికల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా విధులు నిర్వహించిన ఉద్యోగుల సేవలు ఎంతో అభినందనీయమని కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ అన్నారు. సోమవారం ఎన్నికలను సమర్థంగా నిర్వహించిన క్రమంలో టీఎన్జీఓ ఆధ్వర్యంలో కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, కమిషనర్ ఆఫ్ పోలీస్ శ్వేతలను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికలు, కౌంటింగ్ పకడ్బందీగా నిర్వహించడంలో ఉద్యోగుల పాత్ర ఎంతో ఉందని, ఎక్కడ ఏ చిన్న ఫిర్యాదులు లేకుండా పనిచేశారన్నారు. భవిష్యత్ లో జరగబోయే ఎన్నికలను సైతం సమర్థవంతంగా నిర్వర్తిస్తారని ఆశిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పరమేశ్వర్ , కార్యదర్శి విక్రం రెడ్డి, సురేందర్ రెడ్డి, సత్యనారాయణ, నగేష్, సుమన్, సాయి, శ్రీధర్, ఉపేందర్, శ్రీకాంత్, తదితర ఉద్యోగులు పాల్గొన్నారు.

సిబ్బందికి అభినందనలు

దుబ్బాకటౌన్: నియోజకవర్గంలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా సహకరించిన అధికారులు, సిబ్బందికి ఆర్ఓ, అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా, ఇబ్బందులు లేకుండా సక్రమంగా జరగడం, ఇందుకు అన్ని విధాలుగా అధికారులు కృషి చేయడంతో ప్రత్యేకంగా అభినందించారు.



గరీమా అగర్వాల్‌తో అధికారులు

క్లుప్తంగా

సైబర్ కేటుగాళ్ల బురిడీ



సిద్దిపేటకమాన్: సైబర్ మోసగాళ్ల మాటలకు నలుగురు నగదును పోగొట్టుకున్నారు. ఈ సంఘటనలు గజ్వేల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నాయి. సీపీ శ్వేత కథనం ప్రకారం.. ఓ వ్యక్తికి బ్యాంకు అధికారినంటూ పాన్ కార్డు అప్‌డేట్ చేయాలని గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి ఓ లింకును పంపాడు. ఆ మాటలు నమ్మిన బాధితుడు అందులో వివరాలు నమోదు చేయగానే తన ఖాతా నుంచి రూ.12,500 డెబిట్ అయినట్లు మెసేజ్ వచ్చింది. అలాగే భూంపల్లి స్టేషన్ పరిధిలోని ఓ మహిళకు ఎస్‌బీఐ బ్యాంక్ నుంచి మాట్లాడుతున్నామని, క్రెడిట్ కార్డు అప్‌గ్రేడ్ చేస్తామని గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేశాడు. ఆ మాటలు నమ్మిన బాధితురాలు తన ఫోన్‌కు వచ్చిన ఓటీపీ వివరాలు తెలుపగా ఖాతా నుంచి రూ.22,557 డెబిట్ అయినట్లు మెసేజ్ వచ్చింది. అలాగే చిన్నకోడూర్ స్టేషన్ పరిధిలోని ఓ మహిళ ఒక యాప్‌లో చొక్కా ఆర్డర్ చేసి క్యాన్సిల్ చేసింది. గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి తిరిగి డబ్బులు ఖాతాలో జమ కావాలంటే వివరాలు నమోదు చేయాలని ఓ లింకును పంపాడు. ఆ మాటలు నమ్మిన బాధితురాలు లింకులో తన వివరాలు నమోదు చేయగానే ఖాతా నుంచి రూ.56,360 డబ్బులు డెబిట్ అయినట్లు మెసేజ్ వచ్చింది. చేర్యాలస్టేషన్ పరిధిలోని ఓ వ్యక్తి కేవైసీ అప్‌డేట్ పేరుతో వచ్చిన వాట్సప్ మెసేజ్‌కు స్పందించి తన ఖాతా నుంచి రూ.13,400 పోగొట్టుకున్నాడు. దీంతో బాధితులు సైబర్ మోసపోయినట్లు గుర్తించి వెంటనే జాతీయ హెల్ప్‌లైన్ నంబర్ 1930కు ఫిర్యాదు చేశారు.

అథ్లెటిక్స్ పోటీలకు విద్యార్థి ఎంపిక



ఇసాక్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

హుస్నాబాద్: 67వ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు హుస్నాబాద్ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థి బానోతు ఇసాక్ ఎంపికయ్యాడు. ఈనెల 5 నుంచి 7వ తేదీ వరకు హన్మకొండలో జరిగే రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ 5కే రేస్ వాక్‌లో పాల్గొననున్నాడు. కాగా విద్యార్థికి పాఠశాల ఉపాధ్యాయినీ బండారి సువర్ణలీల స్పోర్ట్స్ కిట్స్ అందజేశారు. అలాగే ఉపాధ్యాయుడు సుభాష్ రూ.500ల నగదు అందజేశారు. రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో రాణించి జాతీయ స్థాయి ఎంపిక కావాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం వాసుదేవ రెడ్డి, ఉపాధ్యాయులు వీరారెడ్డి, వెంకట రమణారెడ్డి, రాజమల్లు, మార్కండేయ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై పారాహుషార్


సీపీ శ్వేత

చేర్యాల(సిద్దిపేట): సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజలను సీపీ శ్వేత సోమవారం హెచ్చరించారు. ఆమె కథనం ప్రకారం.. చేర్యాల పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ బాధితుడికి తన ఖాతాకు సంబంధించిన కేవైసీ అప్‌డేట్ చేసుకోమని వాట్సాప్‌కు మెసేజ్ వచ్చింది. వెంటనే ఆ లింక్‌ను ఓపెన్ చేసి అందులో బ్యాంకు వివరాలు, ఓటీపీ పొందుపరిచి సబ్మిట్ చేయగానే బాధితుడి ఖాతా నుంచి రూ.13,400 డెబిట్ అయ్యాయి. అనుమానం వచ్చిన బాధితుడు వెంటనే సైబర్ సెల్ జాతీయ హెల్ప్ లైన్ నంబర్ 1930 కాల్ చేసి ఫిర్యాదు చేశాడన్నారు. సైబర్ నేరస్తులు వివిధ రకాలుగా నేరాలకు పాల్పడుతున్నారని, అలాంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

కేసీఆర్ సన్నిహితుడికి షాక్

ఎంపీ బీబీపాటిల్ కోటకు బీటలు

- జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో ఏడు ఎమ్మెల్యే స్థానాలు
- ఐదింటిలో బీఆర్ఎస్ ఓటమి, రెండింటిలో గెలుపు
- అందులో కేసీఆర్ పోటీ చేసిన కామారెడ్డితోపాటు కోల్పోయిన సిట్టింగ్ స్థానాలు



జహీరాబాద్: బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్‌కు అత్యంత సన్నిహితుడిగా పేరుండటమే కాకుండా జహీరాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి రెండు పర్యాయాలు విజయం సాధించిన బీబీ పాటిల్ కోటకు బీటలు వారాయి. జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో 7 అసెంబ్లీ స్థానాలున్నాయి. సంగారెడ్డి జిల్లాలోని జహీరాబాద్, నారాయణఖేడ్, అందోల్, కామారెడ్డి జిల్లా పరిధిలోని ఎల్లారెడ్డి, కామారెడ్డి, బాన్సువాడ, జుక్కల్ అసెంబ్లీ స్థానాలున్నాయి. వీటిలో బీఆర్ఎస్ కామారెడ్డి, ఎల్లారెడ్డి, జుక్కల్, అందోల్, నారాయణఖేడ్ స్థానాలను కోల్పోయింది. జహీరాబాద్, బాన్సువాడ స్థానాలను మాత్రమే నిలుపుకొంది. పాటిల్ కేసీఆర్‌కు సన్నిహితుడిగా ఉండటంతో మహారాష్ట్రలో బీఆర్ఎస్ సభల నిర్వహణ బాధ్యతలు సైతం చూశారు. అలాగే సొంత పార్లమెంట్ పరిధిలోని సిట్టింగ్ స్థానాలను సైతం నిలుపుకోలేక పోయారు. అంతే కాకుండా అప్పుడు ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్ కామారెడ్డి నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఇక్కడి బీజేపీ అభ్యర్థి వెంకటరమణారెడ్డి 6,741 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. దీంతో కేసీఆర్ రెండో స్థానంతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. గతంలో ఈ స్థానం బీఆర్ఎస్ గెలుచుకుంది. ఇదిలా ఉంటే పాటిల్ తన సొంత అసెంబ్లీ నియోజకవర్గం అయిన జుక్కల్‌లో సైతం బీఆర్ఎస్ తన సిట్టింగ్ స్థానాన్ని కోల్పోయింది. ఇక్కడ కాంగ్రెస్ అభ్యర్థి లక్ష్మీకాంతారావు బీఆర్ఎస్ అభ్యర్థి హన్మంత్‌షిండేపై గెలుపొందారు. ఎల్లారెడ్డిలోనూ బీఆర్ఎస్ అభ్యర్థి జాజుల సురేందర్, కాంగ్రెస్ అభ్యర్థి మదన్‌మోహన్‌రావు చేతిలో 24 వేల ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. సంగారెడ్డి జిల్లా పరిధిలో ఉన్న అందోల్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి చంటి క్రాంతికిరణ్ సైతం కాంగ్రెస్ అభ్యర్థి దామోదర రాజనర్సింహ చేతిలో 28 వేల ఓట్ల తేడాతో ఓటమి చెందారు. నారాయణఖేడ్ స్థానం సైతం బీఆర్ఎస్ అభ్యర్థి అయిన భూపాల్‌రెడ్డి 6,547 ఓట్ల తేడాతో కాంగ్రెస్ అభ్యర్థి సంజీవరెడ్డి చేతిలో ఓటమి చెందారు. బాన్సువాడ, జహీరాబాద్ సిట్టింగ్ స్థానాలను మాత్రమే బీఆర్ఎస్ నిలుపుకొంది. గత ఎన్నికల్లో జహీరాబాద్‌లో బీఆర్ఎస్ అభ్యర్థికి 35 వేల ఓట్ల మెజారిటీ రాగా అది 13 వేలకు పడిపోయింది.

అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీలవారీగా పోలైన ఓట్లు

బీఆర్ఎస్	:	5,30,194
కాంగ్రెస్	:	5,48,348
బీజేపీ	:	1,72,575



ఎంపీ బీబీ పాటిల్

ఇక్కడే ప్రచారానికి పరిమితం

జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ పార్లమెంట్ పరిధిలో అంతంత మాత్రంగానే ప్రచారం చేశారు. ప్రధానంగా తన సొంత నియోజకవర్గం అయిన జుక్కల్‌తోపాటు కేసీఆర్ పోటీ చేసిన కామారెడ్డి నియోజకవర్గాలపైనే దృష్టి పెట్టారు. అయినా వారిని ఓటమి నుంచి తప్పించలేక పోయారు. కేసీఆర్, హరీశ్‌రావు జహీరాబాద్‌కు ప్రచారానికి వచ్చినప్పుడు మాత్రమే పాటిల్ జహీరాబాద్ సభల్లో పాల్గొన్నారు. అనంతరం ప్రచారానికి దూరంగా ఉన్నారు.

హుస్నాబాద్‌లో హస్తం హవా

హుస్నాబాద్: అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో హుస్నాబాద్‌లోని ఓటర్లు అత్యధికంగా కాంగ్రెస్ అభ్యర్థి పొన్నం ప్రభాకర్‌కే ఓటు వేశారు. కాంగ్రెస్ నుంచి పొన్నం ప్రభాకర్, బీఆర్ఎస్ నుంచి సతీశ్‌కుమార్, బీజేపీ నుంచి బొమ్మ శ్రీరాంచక్రవర్తి బరిలో నిలిచారు. పట్టణంలో మొత్తం ఓట్లు 18,118 ఓట్లుగా ఇందులో 14,550 ఓట్లు పోలయ్యాయి. ప్రభాకర్‌కు 7,066 ఓట్లు, సతీశ్‌కుమార్‌కు 6,273, శ్రీరాంచక్రవర్తికి 719 ఓట్లు నమోదయ్యాయి. దీంతో పట్టణంలో పొన్నానికి 793 ఓట్ల మెజార్టీ సాధించాడు. పట్టణంలో మొత్తం 18 (6 నుంచి 23) బూత్‌లు ఏర్పాటు చేశారు. 8, 10, 11, 19, 22 బూత్‌ల్లో సతీశ్‌కుమార్ ఆధిక్యతను ప్రదర్శించారు. మిగతా బూత్‌ల్లో పొన్నం ఆధిక్యతను చాటుకున్నారు. బూత్‌ల వారీగా అభ్యర్థులకు వచ్చిన ఓట్ల వివరాలు..

బూత్ నంబర్	పొన్నం ప్రభాకర్	శ్రీరాం చక్రవర్తి	సతీశ్ కుమార్
6	460	37	343
7	401	43	316
8	379	43	396
9	400	21	343
10	315	26	479
11	401	39	447
12	328	28	302
13	470	55	406
14	506	59	390
15	281	64	199
16	486	44	383
17	354	47	273
18	463	62	440
19	333	21	354
20	464	31	365
21	446	38	313
22	238	13	259
23	341	48	265

ఆత్మ చైర్మన్ రంగారెడ్డి రాజీనామా



గుండా రంగారెడ్డి

జగదేవ్‌పూర్(గజ్వేల్): ప్రజాతీర్పును గౌరవిస్తూ బీఆర్ఎస్ ప్రభుత్వం కల్పించిన ఆత్మ కమిటీ చైర్మన్ పదవికి రాజీనామా చేస్తున్నట్లు గుండా రంగారెడ్డి ప్రకటించారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్‌తో పాటు హరీశ్‌రావు తనకు నామినేటెడ్ పదవి ఇచ్చి గౌరవించినందుకు కృతజ్ఞతలు తెలుపుతున్నానని అన్నారు. ప్రభుత్వం తరఫున ప్రోటోకాల్ ఇచ్చారని పేర్కొన్నారు. ప్రభుత్వం మారినందునా ప్రజల పక్షాన ఉంటూ, పార్టీ కార్యకర్తలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానన్నారు. కొత్త ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, తెలంగాణకు మేలు చేస్తే స్వాగతిస్తామని, ప్రజలకు ఇబ్బంది వస్తే వారి పక్షాన పనిచేస్తామన్నారు.

పల్లాకు పట్టం

చేర్యాలలో 5,163 ఓట్లు, మున్సిపాలిటీలో 532 మెజార్టీ కట్టబెట్టిన ప్రజలు

చేర్యాల(సిద్దిపేట): ఆదివారం వెలువడిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో జనగామ ఎమ్మెల్యేగా విజయం సాధించిన బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డికి చేర్యాల రూరల్ మండలంలో 5,163 ఓట్లు మెజారిటీ రాగా.. మున్సిపల్ పరిధిలో 532 ఓట్లు వచ్చాయి. మున్సిపాలిటీతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న మొత్తం 49 బూత్‌ల్లో 38,170 ఓట్లు పోలయ్యాయి. ఇందులో 20,006 ఓట్లు బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డికి రాగా, 14,311 ఓట్లు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి వచ్చాయి. మిగతా 3,853 ఓట్లు బరిలో నిలిచిన మిగతా అభ్యర్థులందరూ పంచుకున్నారు.

మున్సిపాలిటీలోనూ..

మొత్తం 15 బూత్‌ల్లో 10,572 ఓట్లు పోలవగా 5,090 ఓట్లు బీఆర్ఎస్‌కు రాగా 4,558 ఓట్లు కాంగ్రెస్‌కు వచ్చాయి. మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 15 బూత్‌ల్లోని తొమ్మిదింట్లో (36, 37, 40, 41, 42, 46, 47, 48, 49) బీఆర్ఎస్‌కు ఆధిక్యం చేకూరింది. 6 బూత్‌ల్లో(38, 39, 43,44, 45, 50) కాంగ్రెస్‌కు మెజార్టీ వచ్చింది. మండల పరిధిలోని గ్రామాల్లో చూస్తే ఆకునూరులో 32వ బూత్, ముస్త్యాలలో 69వ బూత్‌లో కాంగ్రెస్ అభ్యర్థి కొమ్మూరికి ఆధిక్యం రాగా మిగతా గ్రామాల్లో బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా హవా కొనసాగింది. అత్యధికంగా చుంచనకోటలో 777 ఓట్ల మెజారిటీ రాగా అత్యల్పంగా రాంపూర్‌లో 15 ఓట్ల మెజార్టీ వచ్చింది.

వేర్వేరు సంఘటనల్లో ఇద్దరి మృతి

జహీరాబాద్: వేర్వేరు సంఘటనల్లో ఇద్దరు మృతి చెందారు. బావిలో పడి ఒకరు, సెప్టిక్ ట్యాంక్‌లో పడి మరొకరు మరణించారు. ఈ సంఘటనలు పట్టణంలో జరిగాయి. పోలీసులు కథనం ప్రకారం .. మండలంలోని పస్తాపూర్ గ్రామానికి చెందిన విఠల్ (45) కూలీ పనులు చేసుకొని జీవిస్తున్నాడు. తాగిన మైకంలో గ్రామ శివారులోని వ్యవసాయ బావిలో పడి మృతిచెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. విఠల్ భార్య నర్సమ్మ ఫిర్యాదు మేరకు కేసును పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సెప్టిక్ ట్యాంకులో పడి...

పట్టణంలోని గడి కాలనీకి చెందిన శ్రీనివాస్(48) పాత సామాను సేకరిస్తున్నాడు. ఓ వెంచర్‌లో ఉన్న సెప్టిక్ ట్యాంక్‌లో పడి మరణించ ఉండటాన్ని పోలీసులు కనుగొన్నారు. ప్రమాదవశాత్తు అందులో పడి మరణించి ఉంటాడని భావిస్తున్నారు. శ్రీనివాస్ తల్లి నాగమ్మ ఫిర్యాదు మేరకు కేసును పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బోరు మోటారులో రాళ్లు వేసిన దుండగులు

దోమ: బోరు మోటార్‌లో ఆదివారం రాత్రి దుండగులు రాళ్లు వేశారు. ఇది మండల పరిధిలోని తిమ్మాయిపల్లి గ్రామానికి చెందిన చీమె మైసయ్యకు చెందినది. ఆయన ఉదయాన్నే పంటకు నీరు పెడుదామని బోరు వేసేందుకు వెళ్లాడు. అందులో రాళ్లు వేసి ఉండటంతో అది కాస్తా పాడైపోయిందని వాపోయాడు. ఇప్పటికైనా దుండగులను పట్టుకొని చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను కోరుతున్నారు.



బోరు మోటారుకు మరమ్మతులు చేస్తున్న రైతులు

లారీ ఢీకొని వ్యక్తి మృతి

చిన్నశంకరంపేట(మెదక్): లారీ ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన 44వ జాతీయ రహదారి నార్సింగి మండల కేంద్రంలోని ఎల్లమ్మ ఆలయం వద్ద సోమవారం రాత్రి చోటు చేసుకుంది. నార్సింగి ఎస్‌ఐ అహ్మద్ మోహివుద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం.. నార్సింగి పట్టణం వడ్డెర కాలనీకి చెందిన గండికోట యాదగిరి (45) వడ్లను బియ్యం పడుతున్నారో లేదో తెలుసుకుందామని ద్విచక్ర వాహనంపై రైస్ మిల్లుకు బయలుదేరాడు. ఎల్లమ్మ దేవాలయం వద్దకు రాగానే వెనుక నుంచి వచ్చిన లారీ అతడిని ఢీకొని తలపై నుంచి వెళ్లిపోయింది. ఈ ఘటనలో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం రామాయంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామని ఎస్‌ఐ తెలిపారు. యాదగిరి భార్య ఫిర్యాదు మేరకు కేసును నార్సింగి పోలీసులు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



యాదగిరి(ఫైల్)

యువకుడి అదృశ్యం

కొండపాక(గజ్వేల్): ఇంటి వద్దే ఉంటున్న యువకుడు అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన కుకునూరుపల్లి స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై పుష్పరాజ్ తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని కోనాయిపల్లికి చెందిన నక్క పుండరీకం చిన్న కుమారుడు మారుతీ డిగ్రీ పూర్తి చేసుకొని ఇంటి వద్దే ఉంటున్నాడు. నవంబరు 29న ఇంట్లోంచి ఎవరికీ చెప్పాపెట్టకుండా వెళ్లిపోయాడు. అదే రోజు మధ్యాహ్నం అతడు ఆర్టీసీ బస్టాండ్‌లో హైదారాబాద్ బస్సు ఎక్కుతున్నాడని ఇదే గ్రామస్తుడు, పుండరీకానికి ఫోన్ ద్వారా సమాచారం అందించాడు. కొద్ది నెలల నుంచి కొడుకు మానసిక స్థితి బాగుండటం లేదని అతడికి తండ్రి తెలిపాడు. అప్పటి నుంచి ఈనెల 4వ తేదీ వరకు బంధువులు, తెలిసిన, కుమారుడి మిత్రుల వద్ద వెతికినా ఎలాంటి ఆచూకీ లభించలేదు. తండ్రి ఫిర్యాదు ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

గంజాయి విక్రేతకు రెండేళ్ల జైలు

శిక్ష విధించిన వికారాబాద్ కోర్టు

ధారూరు: గంజాయితో విక్రేతకు రెండేళ్ల జైలు శిక్ష, జరిమానాను వికారాబాద్ ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి కె.శ్రీకాంత్ విధించారు. సీఐ రామకృష్ణ, ఎస్‌ఐ సంతోష్‌కుమార్ కథనం వివరాల ప్రకారం.. మండల పరిధిలోని స్టేషన్‌ధారూరు సమీపంలో రైల్వే వంతెనపై గంజాయి సంచితో 2021 నవంబర్ 8న అస్సాం రాష్ట్రానికి చెందిన మిథున్ పోలీసులకు పట్టుబడ్డాడు. అప్పటి సీఐ తిరుపతిరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. అతను గంజాయి గింజలు తీసుకువచ్చి అడవిలో విత్తనాలు చల్లి చెట్లను పెంచుతున్నాడని, 6 నెలలు ఒక ప్రాంతంలో ఉంటే ఆ తర్వాత వేరే ప్రాంతానికి వెళ్లిపోతాడని, ఎప్పుడూ గంజాయి విత్తనాలు, ఆకులు సిద్ధంగా ఉంటాయనే సమాచారం పోలీసులకు తెలిసింది. ఆ మేరకు ముందస్తు సమాచారంతో అప్పట్లో దాడి చేసి పట్టుకున్నారు. ఆపై కేసు నమోదు చేశారు. కాగా ఈ కేసులో 2 ఏళ్లు, రూ.2 వేలు జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు ఇచ్చారని పోలీసులు తెలిపారు.

కాంగ్రెస్ కంచుకోటగా మానూరు

చేజారిన నాగల్‌గిద్ద

మనూరు(నారాయణఖేడ్): మనూరు మరోమారు కాంగ్రెస్‌కు కంచుకోటగా నిలిచింది. మండల పరిధిలోని కాంగ్రెస్‌కు 10,150 ఓట్లు రాగా బీఆర్ఎస్‌కు 8,774 ఓట్లు వచ్చాయి. అందులో కాంగ్రెస్‌కు 1,376 మేర ఓట్ల లీడ్ వచ్చింది. మండలంలోని లీడ్ వచ్చిన గ్రామాలు ఇలా ఉన్నాయి. బోరంచలో 445, బెల్లాపూర్‌లో 286, మనూరులో 267, తుమ్నూర్‌లో 198, అతిమ్యాల్‌లో 155, తిమ్మాపూర్‌లో 101 ఓట్ల మేర ఆధిక్యం వచ్చింది. కాగా గతంలో నాగల్ గిద్ద మండలం కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉంది. ఇక్కడ గిరిజన, ఎస్సీ ఓటర్లు అధికంగా ఉన్నారు. తాజాగా నాగల్‌గిద్ద మండలంలో బీఆర్ఎస్‌కు 9,775 ఓట్లు రాగా కాంగ్రెస్‌కు 9,016 మేర ఓట్లు వచ్చాయి. దీంతో నాగల్‌గిద్ద మండలంలో గులాబీ పార్టీకి 759 ఓట్ల మెజార్టీ వచ్చింది. అయితే ఈ మండలంలో హస్తంకు ఇరక్‌పల్లి గ్రామ పంచాయతీ, దాని అనుబంధ 18 తండాలు కలుపుకొని 432 మేర ఓట్లు లీడ్ రాగా వల్లూర్‌లో 139 ఓట్ల ఆధిక్యం వచ్చింది. దీంతో ఖేడ్ నియోజకవర్గంలో ఈ రెండు మండలాలపై నాయకులు చర్చించుకుంటున్నారు.

సీపీని కలిసిన టీఎన్‌జీవోఎస్ ఉద్యోగులు

సిద్దిపేటకమాన్: కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్, సీపీ శ్వేతను టీఎన్‌జీవోఎస్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు గ్యాదరి పరమేశ్వర్, కార్యదర్శి కొమండ్ల విక్రమ్‌రెడ్డి సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించినందుకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సురేందర్‌రెడ్డి, సుమన్, సత్యనారాయణ, నగేశ్, సుమన్, సాయి, శ్రీధర్, ఉపేందర్, శ్రీకాంత్, తదితర ఉద్యోగులు పాల్గొన్నారు.

సమస్యలపై పోరాడండి

ఎమ్మెల్యే యాదయ్యతో మాజీ సీఎం కేసీఆర్

నవాబుపేట: ఎమ్మెల్యేగా విజయం సాధించిన యాదయ్య సోమవారం ఎర్రవల్లిలోని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఫామ్‌హౌస్‌లో కలిశారు. ఈ సందర్భంగా హ్యాట్రిక్ సాధించటం పట్ల మాజీ సీఎం.. యాదయ్యను అభినందించారు. నిత్యం ప్రజల్లో ఉండి ప్రజాసమస్యలపై పోరాడాలని, పరిష్కారానికి కృషి చేయాలని సూచించినట్లు ఎమ్మెల్యే యాదయ్య తెలిపారు.

ఆధ్యాత్మిక కేంద్రాలుగా

పల్లెలు విరజిల్లాలి



భక్తులకు అనుగ్రహభాషణం చేస్తున్న మాధవానంద సరస్వతీ స్వామి

మిరుదొడ్డి(దుబ్బాక): భక్తి భావనతోనే మనసుకు ప్రశాంతత లభిస్తుందని మాధవానంద సరస్వతీ స్వామి భక్తులకు అనుగ్రహభాషణం చేశారు. మిరుదొడ్డి, లక్ష్మీనగర్, ఆరెపల్లి గ్రామాల శివారులో వెలసిన సదానందాశ్రమ 40వ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా పాదుకా పూజలు, పుష్పార్చన, బిల్వపత్ర పూజ, సామూహిక అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అనుగ్రహ భాషణం చేస్తూ ప్రతి ఒక్కరూ భక్తి భావన అలవర్చుకుంటేనే పల్లెలు ఆధ్యాత్మిక కేంద్రాలుగా విరాజిల్లుతాయన్నారు. అందరూ భక్తి భావనతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలు అలవర్చుకోవాలన్నారు. నిత్యం దైవారాధనలు చేసి పుణ్యఫలాలను దక్కించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైదిక నిర్వాహకులు వితాల రాజపున్నయ్య శర్మ, చంద్ర శేఖర శర్మ, రమేష్ శర్మ, ఆశ్రమ శిష్యబృందం సభ్యులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం వార్షికోత్సవంలో పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాద వితరణతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

మెజారిటీ రాదు.. ఒట్టు..

- పరిశీలకుడి ఎదుట బీఆర్ఎస్ కౌన్సిలర్ చాలెంజ్
- ఆధిక్యం రావడంతో గుండు కొట్టించుకున్న గంగాధర్



గుండు కొట్టించుకున్న కౌన్సిలర్ గంగాధర్

రామాయంపేట(మెదక్): ఎన్నికల నేపథ్యంలో రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలో మెదక్ బీఆర్ఎస్ అభ్యర్థికి మెజారిటీ రాదని చాలెంజ్ చేసిన ఇదే పార్టీకి చెందిన బీఆర్ఎస్ కౌన్సిలర్ ఒకరు గుండు కొట్టించుకున్న ఉదంతమిది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. ఎన్నికల ముందు బీఆర్ఎస్ పరిశీలకులు మున్సిపాలిటీ కార్యాలయానికి వచ్చి పార్టీ పరంగా సర్వేలో భాగంగా కౌన్సిలర్ల అభిప్రాయాలు సేకరించారు. ఈ మేరకు చైర్మన్ జితేందర్‌గౌడ్‌తోపాటు కౌన్సిలర్లు తమ అభిప్రాయాలను తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో బీఆర్ఎస్ అభ్యర్థికి మెజారిటీ రాదని, కాంగ్రెస్ అభ్యర్థికి మెజారిటీ వస్తుందని, తాను స్వయంగా పట్టణంలో పర్యటించగా ఈ విషయం తెలిసిందని 8వ వార్డు కౌన్సిలర్ చిలుక గంగాధర్ పరిశీలకుడితో వాగ్వాదం చేశారు. ఒకవేళ మున్సిపాలిటీ పరిధిలో మెజారిటీ వస్తే తాను గుండు కొట్టించుకొని గడ్డం, మీసాలు తీసి వేస్తానని చాలెంజ్ చేశారు. ఎన్నికల కౌంటింగ్ అనంతరం బీఆర్ఎస్ అభ్యర్థికి మెజారిటీ వచ్చిందని తెలుసుకున్న సదరు కౌన్సిలర్ గంగాధర్ అన్న మాటను నిలబెట్టుకున్నారు.

బాస్కెట్ బాల్ పోటీలకు గురుకుల విద్యార్థులు


జిన్నారం(పటాన్‌చెరు): రాష్ట్ర స్థాయిలో జరిగే బాస్కెట్ బాల్ పోటీలకు జిన్నారంలోని గిరిజన గురుకుల పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు ఎన్నికైనట్లు ప్రిన్సిపాల్ మధుసూదన్‌రెడ్డి సోమవారం తెలిపారు. జిల్లా తరఫున రాష్ట్ర స్థాయిలో జరిగే బాస్కెట్ బాల్ పోటీలకు యువరాజ్, జగన్, నవదీప్, రిత్విక్, గోవర్ధన్, దినేశ్ ఎన్నికయ్యారని పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయిలో పోటీల్లో పాల్గొననున్న విద్యార్థులకు ఆయన, కోచ్ బాల్‌రాజ్ తదితరులు అభినందనలు తెలిపారు.



పోటీలకు ఎన్నికైన విద్యార్థులు

కారు జోరు.. ప్రత్యర్థులు బేజారు

- 2020 ఉప ఎన్నికల్లో బీజేపీకి మెజార్టీ.. ఇప్పుడు బీఆర్ఎస్‌కు
- ఆపార్టీ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డికి 53,513 ఓట్ల మెజార్టీ



దుబ్బాక టౌన్: రాష్ట్ర మంతా కాంగ్రెస్ గాలి వియగా.. దుబ్బాక నియోజకవర్గంలో మాత్రం బీఆర్ఎస్ ఎదురులేకుండా దూసుకు పోయింది. ఈ నియోజకవర్గంలో దివంగత ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డి అనారోగ్యంతో మరణించగా 2020లో జరిగిన ఉప ఎన్నికల్లో అనూహ్యంగా బీఆర్ఎస్ అభ్యర్థి దివంగత నేత రామలింగారెడ్డి సతీమణి సుజాతపై 1,079 స్వల్ప ఓట్ల మెజార్టీతో బీజేపీ ఎమ్మెల్యేగా మాధవనేని రఘునందన్‌రావు గెలుపొందడం విదితమే. తాజాగా జరిగిన ఎన్నికల్లో దుబ్బాకలో బీఆర్ఎస్ తరఫున ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, బీజేపీ నుంచి ఎమ్మెల్యే రఘునందన్‌రావు, కాంగ్రెస్ నుంచి దివంగత మంత్రి చెరుకు ముత్యంరెడ్డి తనయుడు శ్రీనివాస్‌రెడ్డి పోటీలో ఉండటంతో ముగ్గురి మధ్యన నువ్వానేనా అనేలా ఫైట్ జరిగింది. ఎవరు గెలిచిన 5 వేల లోపు ఓట్లు మెజార్టీతో మాత్రమే అంటూ అందరూ ఊహించారు. కానీ అందరీ అంచనాలను తలకిందులు చేస్తూ ప్రభాకర్‌రెడ్డికి 53,513 ఓట్ల భారీ మెజార్టీ వచ్చింది. మొత్తం 19 రౌండ్లలో కారు దూకుడుకు ప్రత్యర్థులు కనీసం పోటీ కూడా ఇవ్వని పరిస్థితి. కారు స్పీడ్ ముందు కాంగ్రెస్ అభ్యర్థికి కనీసం డిపాజిట్ కూడా దక్కక పోవడం, ఇక గెలుస్తుందన్న బీజేపీ కేవలం డిపాజిట్ దక్కించుకొని కేవలం 44,366 ఓట్లకే పరిమితమైంది.

దుబ్బాక మున్సిపాలిటీలో బీఆర్ఎస్‌కు 5,355 ఓట్ల మెజార్టీ

దుబ్బాక మున్సిపాలిటీలో బీజేపీకి గత ఉప ఎన్నికల్లో 3 వేలకు పైగా మెజార్టీ రావడం ఈ సారి కూడా తమకే వస్తుందని బీజేపీ నేతలు ఊహించగా వారి అంచనాలను తలకిందులయ్యాయి. బీఆర్ఎస్ 5355 ఓట్ల మెజార్టీ సాధించింది. మొత్తం మున్సిపాలిటీలో 17,383 ఓట్లు పోలవ్వగా కారు పార్టీకి 10,400 ఓట్లు రాగా బీజేపీకి 5045 ఓట్లు, కాంగ్రెస్‌కు కేవలం 1,386, ఇతరులకు 552 ఓట్లు పడగా బీఆర్ఎస్ అభ్యర్థి ప్రభాకర్‌రెడ్డికి ఏకంగా 5,355 మెజార్టీ వచ్చింది.

– దుబ్బాక మండలంలో బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డికి 12 వేల పై చిలుకు మెజార్టీ వచ్చింది. మండలంలోని అన్ని గ్రామాల్లో మెజార్టీ వచ్చింది. దీంతో మున్సిపాలిటీతో పాటు మండలమంతా కలిసి 17,683 ఓట్ల మెజార్టీ బీఆర్ఎస్‌కు దక్కింది. ఉమ్మడి మిరుదొడ్డి మండలంలో రఘునందన్‌రావుపై ప్రభాకర్‌రెడ్డికి 9,069 ఓట్ల భారీ ఓట్ల మెజార్టీ వచ్చింది. తొగుట మండలంలో కాంగ్రెస్ అభ్యర్థి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి 2 వస్థానంలో నిలువగా బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు 3 వ స్థానానికే పరిమితం కావాల్సి వచ్చింది. ఈ మండలంలో బీఆర్ఎస్‌కు 5,865 ఓట్ల మెజార్టీ బీజేపీపై లభించింది. ఉమ్మడి దౌల్తాబాద్ మండలంలో(రాయపోల్ మండలం కలిపి) గత ఉప ఎన్నికల్లో సైతం బీఆర్ఎస్‌కు మెజార్టీ 3,500 పై చిలుకు ఇవ్వగా ఈ సారి ఏకంగా 11,869 ఓట్ల మెజార్టీ వచ్చింది. చేగుంట ఉమ్మడి మండలం(నార్సింగ్ మండలం కలిపి)9, 489 ఓట్ల మెజార్టీ బీఆర్ఎస్‌కు దక్కింది. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో మొత్తంగా 53,513 ఓట్ల మెజార్టీతో కొత్త ప్రభాకర్‌రెడ్డి గెలుపొందారు.